క్లుప్తంగా

'సీతారామ' రైతులకు పరిహారమేది?



జగ్గారం గ్రామంలో సమావేశమైన నిర్వాసిత రైతులు

దమ్మపేట: మండలంలోని జగ్గారం రెవెన్యూ పరిధిలో సీతారామ ప్రాజెక్టు కాలువ కింద భూములు కోల్పోయి, పరిహారం అందని గిరిజన రైతులు సోమవారం మూకుమ్మడిగా సమావేశమయ్యారు. గ్రామంలో మొత్తం 124 మంది రైతుల నుంచి 103 ఎకరాల 7 కుంటల భూమిని, ప్రాజెక్టు కాలువ నిమిత్తం సేకరించగా.. భూములకు పరిహారం అందని రైతులు సమావేశమైయ్యారు. మాట్లాడుతూ.. తమకు పరిహారం ఇవ్వకుండానే సంబంధిత భూమిని సీతారామ ప్రాజెక్టు భూమిగా నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. కేవలం భూమికే తప్ప, భూమిలో ఉన్న పంట, చెట్లకు పరిహారం లేదని అధికారులు పేర్కొంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు విన్నవించిన నేటికి ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన రైతులు ముత్యాలరావు, కుర్సం చిన్నరాజులు, రాజేష్, పాయం హనుమంతు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: అగ్నిప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని పిరాయిగూడెం గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. వివరాలు తెలుసుకుని ఓదార్చారు. అనంతరం ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, వాగే రాజేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎన్డీ నాయకులు

గుండాల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసీలపై హింస దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలు ఈ చర్యలను ఖండించాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కొమరం సీతారాములు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మండల కేంద్రంలో సోమవారం వచ్చేనెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు నిరసనగా చేపట్టే ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు యాసారపు వెంకన్న, మానాల ఉపేందర్, మాదాల అశోక్, ప్రమోద్, అరెం రామారావు, తాటి కృష్ణ, కోరం నరేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

దుమ్ముగూడెం: మండలంలోని పిరాయిగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు పీవీ చారిటబుల్ ట్రస్ట్ (విజయవాడ) చేయూతనందించింది. సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ చేతుల మీదుగా ట్రస్ట్ అందజేసిన నగదును బాధిత కుటుంబాలకు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఆధైర్యపడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చింతరాల రవికుమార్, ఉపాధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, నాయకులు వెంకటేశ్వర్లు ఎడారి ప్రదీప్ కుమార్, దారపు సేనీరాంబాబు ఎ,సిద్ది ప్రవీణ్, గంట్ల ప్రశాంతి, కారం నవీన్, డింగి సందీప్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఈద్ ఉల్ ఫితర్'



కఠోర ఉపవాస దీక్షలు ముగిసిన అనంతరం పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి మసీద్‌లు, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఖురాన్‌ను బోధించారు. నమాజ్ తర్వాత పండుగ శుభాకాంక్షలు చెప్పి, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్





అశ్వారావుపేటరూరల్: ఈద్గాలో సామూహిక ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ములకలపల్లి: రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



కరకగూడెం: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం యువత



చర్లలో ముస్లింల ప్రార్థనలు..



కరకగూడెం: జామ మసీద్‌లో శాంతి సందేశం ఇస్తున్న మౌలానా ఫిరోజ్



అన్నపురెడ్డిపల్లిలో..



దమ్మపేట: మండలపల్లి ఈద్గాలో..



బూర్గంపాడు: పాత గొమ్మూరు ఈద్గా వద్ద..



బూర్గంపాడు: జింకలగూడెం ఈద్గా వద్ద..



అశ్వాపురం ఈద్గాలో ప్రార్థనలు..



ఆళ్లపల్లిలో..



దుమ్ముగూడెం మసీద్‌లో నమాజ్..

విద్యార్థుల అరెస్టుకు నిరసన



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

భద్రాచలంటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టును ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అదే సంఘాల నాయకులు నిరసన కార్యక్రమ చేపట్టారు. ప్రభుత్వ, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలం నిర్ణయాన్ని విరమించుకుని, అరెస్టైన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ ప్రశాంత్, భూపేందర్, రవీందర్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చర్ల: మండంలోని రాళ్లగూడెం మూలమలుపులో ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి ప్రమాదానికి గురవగా తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చినమిడిసిలేరుకు చెందిన మిడియం మల్లయ్య ద్విచక్రవాహనంపై భద్రాచలం వైపునకు వెళ్తూ రాళ్లగూడెంలోని మూలమలుపు వద్ద కింద పడిపోయాడు. ఈ సందర్భంలో అటువైపునకు వెళ్తున్న రాళ్లగూడెంకు చెందిన యువకులు మల్లయ్యను గమనించి పరిశీలించగా.. తలకు బలమైన గాయమై తీవ్రం రక్తస్రావం అవుతుండడంతో సత్యనారాయణపురం తరలించారు. అక్కడి నుంచి భద్రాచలంకు తరలించారు. అయితే మల్లయ్య అదుపుతప్పి పడిపోయాడా లేకా ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

100 శాతం బొగ్గు ఉత్పత్తి



బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: ఏరియాలో మార్చి నెల వరకు 127శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి 2024–25 సంవత్సర వార్షిక లక్ష్యాన్ని చేరుకున్నామని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. సోమవారం జీఎం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక నెల వారీ బొగ్గు, ఓబీ వెలికితీత లక్ష్యాలను వెల్లడించారు. మార్చి నెలలో 11.68లక్షల టన్నులకు గాను 14.85 లక్షల టన్నులతో 127శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఓబీ 15.50 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 16.47లక్షల క్యూబిక్ మీటర్లతో 106శాతం వెలికితీశామన్నారు. 2024 ఏప్రిల్ నుంచి 31 మార్చి 2025 వరకు 127.60 లక్షలకు గాను 127 లక్షల టన్నుల ఉత్పత్తితో 100 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. రైలు, రోడ్డు, రోప్‌వేల ద్వారా 120.78 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేశామని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు నెల చివరలో కురిసిన వర్షం ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిందని, అయినప్పటికీ సవాళ్లు, అవాంతరాలు ఎదుర్కొంటూ లక్ష్యాన్ని సాధించామన్నారు. లక్ష్య సాధనకు కృషి చేసిన సూపర్‌వైజర్లకు, కార్మిక నాయకులకు, కార్మికులకు అయన ధన్యవాదాలు తెలిపారు. మణుగూరు ఓసీ విస్తరణకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, వెంకట్రావ్, లక్ష్మీపతిగౌడ్, మేరీకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్రపై సన్నాహక సమావేశం

మణుగూరుటౌన్: బీజేపీ ప్రభుత్వం బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కాంగ్రెస్ పెద్దలు 'జై బాపూ జైభీమ్ జై సంవిదాన్'కార్యక్రమాన్ని ప్రకటించినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ప్రజాభవన్‌లో మణుగూరు మండల సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు.

కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశానుసారం అన్ని మండలాల్లో జైబాపూ, జై భీమ్ జై సంవిధాన్ నిర్వహించాలన్నారు. అంబేడ్కర్ వారసత్వం, విలువలు కాపాడేందుకు గ్రామాలు, పట్టణాల ఐక్యత, సామాజిక న్యాయం సందేశంతో పాదయాత్ర చేపట్టాలన్నారు. ఈ పాదయాత్రలో రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ఎలా కించపరుస్తూ వచ్చిందో ప్రజలకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

రాజుపేట వాసుల వినతి..

కాగా, మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేటలో రోజుకు సుమారు 700 ఇసుక లారీలు, బొగ్గు టిప్పర్లు తిరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని ఆ గ్రామస్తులు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. రోడ్లపై దుమ్ము, దూళి వ్యాప్తి చెందకుండా ట్యాంకులతో నీళ్లు కొడతామని చెప్పి ఇప్పుడు ఆ పని చేయడం లేదని వాపోయారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద మూడురోజులుగా వేద పండితుల మంత్రోచ్చరణలతో సాగుతున్న ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం వందలాదిమంది భక్తుల మధ్య వైభవంగా సాగింది. మహోత్సవాల సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

ములకలపల్లి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావును మాజీ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. అప్పారావు సోదరుడు రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. సోమవారం సూరంపాలెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలసి ఎంపీ పాల్గొన్నారు. రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రమేష్ దశదిన ఖర్మలో పాల్గొన్నారు, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ములకలపల్లి: గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు తదితర మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యంగా పాలకపక్షం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ములకలపల్లిలోని పెద్దబజారు, వైఎస్సార్‌నగర్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, రాజుపేటలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం రాజుపేట, రాచన్నగూడెం శివార్లలోని వాగులపై రూ.ఐదు కోట్లతో నిర్మించే చెక్‌డ్యాంలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమన్నారు, సూరంపాలెంలో విగ్రహ ప్రతిష్ఠకు సిద్ధమౌతున్న ఆలయాన్ని సందర్శించారు. ఇరిగేషన్ ఈఈ సురేష్‌కుమార్, డీఈ మోతీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, కొప్పుల రాంబాబు, ఎలకం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో నిర్మించాలి

దమ్మపేట: ఇందిరమ్మ ఇళ్లను సరైన నాణ్యత ప్రమాణాలతో పటిష్ఠంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. సోమవారం మండలంలోని మొండివర్రె గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే జారే పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అనంతరం అదే గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు షాకీర్ పాషా, ఇంటిలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, షాకీర్ పాషా, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ములకలపల్లి: చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

ముగిసిన ముత్యాలమ్మ జాతర



జాతర సందర్భంగా ప్రధాన రహదారిపై గంటల కొద్ది నిలిచిన వాహనాలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద జరుగుతున్న జాతర ఉత్సవాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు తలుపులమ్మ అలంకరణలో దర్శనం ఇవ్వగా.. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, అర్చనలు, చండీపారాయణ నివేదనతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని వివిధ రకాల పూజలు చేసి నైవేధ్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, జాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం, సోమవారం రాత్రి భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు, ఉగాది పండుగ నేపథ్యంలో అమ్మవారికి భక్తుల తాకిడి భారీ పెరిగింది. దీంతో ఆలయం పరిసరాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయం వద్ద నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వాహనాల రద్దీతో భక్తులు గంటల కొద్ది వాహనాలత్లో ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో స్థానిక ఎస్సై యయాతి రాజు ఆధ్వర్యంలో ఊట్లపల్లి, వినాయకపురం వద్ద వాహనాలను దారి మళ్లించారు. చివరి రెండు రోజుల్లో దాదాపు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చి ఉంటారని, అధికారులు అంచనా వేశారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా అశ్వారావుపేటలో ముస్లింలు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈద్ ప్రార్థనల తర్వాత స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లోని మసీదు నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్‌లోని ఖబరస్తాన్ వరకు బైక్ ర్యాలీతోపాటు పాదయాత్ర నిర్వహించారు. ముస్లింలంతా నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే వలీపాషా, నజీర్‌తోపాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుల విషయంలో ప్రవేశపెట్టనున్న బిల్లును వ్యతిరేకిస్తు సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలకు హాజరైన ముస్లింలు.. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనలలో పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డుల విషయంలో కేంద్రం పునరాలోచన చేయాలని ముస్లిం మత పెద్దలు కోరారు.

చంద్రుగొండ: కేంద్రంలో తీసుకురానున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు పండుగ రోజు సోమవారం నిరసన తెలిపారు. ప్రత్యేక నమాజులు ఆచరించే ఈద్‌గాహ్‌కు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో హాజరయ్యారు. బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముఫ్తీ అబ్దుల్ రహిమాన్, మసీద్ కమిటీ బాధ్యులు యండి.షమీహుసేన్, రవూఫ్, యండి.ఖాజాహుసేన్, యండి.యాకూబ్‌అలీ వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



బూర్గంపాడు: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

తీరనున్న ఇసుకవాగు కష్టాలు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగుపై వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. వంతెన శ్లాబ్ పనులు పూర్తవగా రెండు వైపులా అప్రోచ్ రహదారి పనులు చేయాల్సి ఉంది. ఇసుకవాగుపై వంతెన నిర్మాణంతో గొందిగూడెం, గొందిగూడెంకొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల్లోని సుమారు 20 గిరిజన గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రతి ఏడాది వర్షాకాలంలో మూడు నెలలపాటు ఇసుకవాగు పొంగి ప్రవహించి ఈ గ్రామాల గిరిజనులు, ఆదివాసీలు బాహ్య ప్రపంచానికి దూరమవుతూ వస్తున్నారు. ఈ సమయంలో కనీస సౌకర్యాలు అందక అవస్థలు పడేవారు. రోగాల బారిన పడితే సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. వైద్యం అందక ఎందరో మృతి చెందారు. వాగులో కొట్టుకుపోయి పలువురు మృతి చెందారు. ఇసుకవాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని గిరిజనులు ఎన్నో ఏండ్లుగా కోరుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో సుమారు రూ.7కోట్లతో 29 మే 2023న ఇసుకవాగుపై వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. కొంత కాలం పనులు సాగి తర్వాత నిలిచిపోయాయి. ఎన్నికలు, ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదు. నూతన ప్రభుత్వంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పలుమార్లు వంతెన పనులు పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించగా.. ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. ఈ వర్షాకాలంలో గిరిజన గ్రామాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయి.



ఇసుకవాగుపై నిర్మించిన వంతెన